క్లుప్తంగా

జగనన్న కాలనీలో గృహ ప్రవేశం



గృహ ప్రవేశంలో రిబ్బన్ కట్ చేస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: జగనన్న కాలనీలో మొట్టమొదటి గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. బూరుగుపాలెంలోని జగనన్న కాలనీలో గ్రామానికి చెందిన వాడపల్లి దేవికి ఇక్కడ స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు ఆమె మొదటగా ఇంటి నిర్మాణం పూర్తి చేయడంతో గృహ ప్రవేశం చేశారు. జగనన్న కాలనీలతో ఎందరో గూడులేని వారికి సొంత ఇంటి కల నెరవేరిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, పార్టీ నాయకులు భద్రాచలం, బొడ్డు గోవిందరావు, భీమిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

136 మందికి వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా శుక్రవారం చంద్రయ్యపేటలో చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల 136 మంది రోగులను పరీక్షించారు. మంచానికే పరిమితమైన ఎనిమిది మందికి ఇళ్లకు వెళ్లి వైద్యం అందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కె.వి. రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ రాము, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకుడు సురేష్, వార్డెన్ బాపునాయుడు

నర్సీపట్నం: అల్లాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేములపూడి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణగా ఇచ్చారు. ట్రస్ట్ నిర్వాహకుడు అల్లాడ సురేష్, వార్డెన్ ఆర్.బాపునాయుడు వీటిని పంపిణీ చేశారు. ఈ ఏడాది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఉన్నత చదువులకు వెళ్లాలని ట్రస్ట్ నిర్వాహకుడు ఆకాంక్షించారు. విద్యార్థులకు ఆర్థికంగా తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వి.కె.వి. రమేష్, శ్రీనివాస్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం వద్దు



రికార్డులు తనిఖీ చేస్తున్న చంద్రశేఖర్

మాకవరపాలెం: మెనూ అమలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సమగ్ర శిక్షా అభియాన్ ఫైనాన్స్ అకౌంట్స్ అధికారి డి.ఆర్.చంద్రశేఖర్ స్పష్టం చేశారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతోపాటు విద్యార్థినులకు అందిస్తున్న గుడ్లు, ఇతర ఆహారాన్ని తనిఖీలు చేశారు. ప్రభుత్వం బాలికా విద్యకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, వారి అభ్యున్నతికి రూ.కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులకు చదువుతోపాటు మెనూ సక్రమంగా అమలు చేయాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ రెండు రోజులుగా తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో గౌరీపరమేశ్వరులను ఊరేగించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



అంబేరుపురంలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: రైతుల సంక్షేమానికి కట్టుబడి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన అందిస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలం అంబేరుపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎక్కడా అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ప్రశంసించారు. మూడు రోజులుగా ఇక్కడ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మంజూరుపై ఆరా తీశారు. ఎటువంటి సిఫారసులు లేకుండా పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సాధికారత ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ధర్మశ్రీ చెప్పారు. ఈ ఏడాది గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు సకాలంలో బిల్లులు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంలో ఫ్యాక్టరీని అప్పుల ఊబిలోంచి బయటకు తీసుకొచ్చామన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులకు సబ్సిడీ ఇవ్వడంతోపాటు నేరుగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పండిన పంటను అక్కడే అమ్ముకునే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏ కారణంతోనైనా ప్రభుత్వ పథకాలు రాకపోతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ వచ్చేలా చూడాలని సచివాలయ సిబ్బంది, ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, ఎంపీటీసీల మాజీ ఫ్లోర్ లీడర్ సూరిశెట్టి నాగదుర్గగోవింద, ఎంపీటీసీ శరగడం నాగేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్, సర్పంచ్ కార్లె ఈశ్వరరావు, ఉప సర్పంచ్ దాడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీటీసీ తనకల కోటి దేముళ్లు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒరుగంటి నెహ్రూ, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



పాఠశాలలో కలుసుకున్న నాటి విద్యార్థులు

కె.కోటపాడు: వారంతా స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువులు సాగించారు. 46 ఏళ్ల తర్వాత చదువుల తల్లి ఒడిలో సందడి చేశారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో 1975–76 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. 32 మంది హాజరై నాటి తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. వివిధ కారణాలతో మరణించిన ఏడుగురు సహ విద్యార్థులకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పూడి శ్రీరామ్మూర్తి, బోళెం సూర్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ కశిరెడ్డి అప్పలనాయుడు, బండారు రామసత్యం, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం



లచ్చన్నపాలెంలో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఈ

మాకవరపాలెం: ప్రభుత్వం మంజూరు చేసిన భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఈఈ నగేష్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని గిడుతూరు, పైడిపాల, తూటిపాల, బూరుగుపాలెం, లచ్చన్నపాలెంలో నిర్మిస్తున్న సచివాలయ, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్ర భవనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది ఈ నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట నర్సీపట్నం డీఈ ప్రసాదరావు, జేఈ వెంకటేశ్వరరావు ఉన్నారు.

రబీ వరి నాట్లు ప్రారంభం

- పెద్దేరు ఆయకట్టులో 5 వేల ఎకరాల్లో సాగు



పెద్దేరు ఆయకట్టులో రబీ వరి నాట్లు వేస్తున్న దృశ్యం

మాడుగుల: పెద్దేరు జలాశయం ఆయకట్టులో రబీ వరినాట్లు ప్రారంభమయ్యాయి. జలాశయంలో సాగు నీరు పుష్కలంగా ఉండటంతో ఐదు వేల ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం వరి నారు ఏపుగా పెరగడం వల్ల వరినాట్లు మొదలయ్యాయి. ఇప్పటికే 500 ఎకరాల్లో రబీ వరి సాగు చేశారు.

పెద్దేరులో పుష్కలంగా సాగు నీరు .. పెద్దేరు జలాశయం గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు, ప్రస్తుతం 136. 45 మీటర్లకు చేరుకుంది. దీంతో రబీ ఆయకట్టుకు ఢోకా లేదని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉద్యోగ అవార్డు గ్రహీతలకు సన్మానం



తహసీల్దార్, సర్వేయర్‌ను సన్మానిస్తున్న మండల రెవెన్యూ సిబ్బంది

రావికమతం: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన తహసీల్దార్ మహేశ్వరరావు, సర్వేయర్ సత్యనారాయణ జిల్లా ఉత్తమ ఉద్యోగులుగా రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి సాలిల నుంచి ప్రశంసాపత్రాలు పొందారు. వీరిని మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, సర్పంచ్‌లు, డిప్యూటీ తహసీల్దార్ శేషు, రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. వారికి అభినందనలు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సూచనలు చేస్తున్న ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టా రద్దు చేస్తామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు హెచ్చరించారు. ఆయన తన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. మండలంలో 56 జగనన్న లేఅవుట్లలో కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోగా పనులు చేయకపోతే రద్దు చేసి వాటి స్థానంలో కొత్త వారికి ఇల్లు ఇస్తామన్నారు. లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు, ఐరన్ సరఫరా చేస్తున్నామని, ఇల్లు కట్టుకునే వెంటనే బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. జల్ జీవన్ మిషన్‌లో రూ.10 కోట్లతో ఇంటింటికీ కుళాయి పనులు చురుగ్గా చేస్తున్నామన్నారు. ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో రోజుకు 12 వేల మంది కూలీల సంఖ్య దాటాలన్నారు. సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆర్బీకే, హెల్త్ క్లినిక్ నూతన భవన నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. జేఈలు జోగారావు, రాజేష్, వెంకటేశ్వరమ్మ, కార్యాలయ పరిపాలనాధికారి పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

నాతవరం: జగనన్న శాశ్వత భూ రీసర్వే ద్వారా ఏళ్ల తరబడి వెంటాడే సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. పెదగొలుగొండపేటలో శుక్రవారం రీసర్వే పనులను ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. రైతుల సమక్షంలో డ్రోన్ ఎగురవేసి రీసర్వే విధి విధానాలపై అవగాహన కల్పించారు. రీసర్వే చేసేటప్పుడు రైతులు తమ రికార్డులతో సరిహద్దులు వద్దకు వస్తే ఈ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. సర్పంచ్ మిరపల వెంకటరమణ ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ, చినగొలుగొండపేట సర్పంచ్ అంకంరెడ్డి నూకాలమ్మ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంకంరెడ్డి రాజు, మండల ఇన్‌చార్జి సర్వేయరు ప్రసాద్, వీఆర్వో, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



పెదగొలుగొండపేటలో సర్వేకు డ్రోన్ ఎగుర వేస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం: జనవరి 27వ తేదీని ఎలక్ట్రీషియన్ డేగా గుర్తించాలని కోరుతూ విజయలక్ష్మీ దుర్గా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీబీఎం కాంపౌండ్ నుంచి అబిద్‌సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఈ ర్యాలీ చేరుకుంది. ఎలక్ట్రీషియన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు.

వాహనాల వేలంలో రూ.4.82 లక్షల ఆదాయం



వేలం నిర్వహించిన వాహనాలు

నర్సీపట్నం: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 23 ద్విచక్ర వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.4,82,300 ఆదాయం వచ్చిందని అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు. గొలుగొండ స్టేషన్ 11, నర్సీపట్నం స్టేషన్‌కు సంబంధించి 23 వాహనాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో గొలుగొండ సీఐ రాజారావు, నర్సీపట్నం ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సాంకేతికతను రైతులు వినియోగించుకోవాలి

రాంబిల్లి : సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సహాయ సంచాలకులు డాక్టర్ విశాలాక్షి అన్నారు. శుక్రవారం హరిపురం బీసీటీ కేవీకేలో కేవీకే శాస్త్రీయ సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశాలాక్షి అధికారులు, రైతులనుద్దేశించి మాట్లాడారు. సాంకేతికతను రైతులు అందిపుచ్చుకునేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలన్నారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి: తిమిరాంలో సూర్యనారాయణస్వామి తీర్థం సందర్భంగా శనివారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయల చొప్పున బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి విశేష పూజలు, సాయంత్రం మహిళల కోలాటం, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా రాజులుబాబు పండగ

గొలుగొండ: నర్సీపట్నం డివిజన్‌లో ప్రసిద్ధి గాంచిన రాజులుబాబు పండగ ఎర్రవరం, చీడిగుమ్మల గ్రామాల్లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎర్రవరం రాజులుబాబు గుడి వద్ద 20 వేల మంది భక్తులు వచ్చి స్వామివారికి కానుకలు సమర్పించుకున్నారు. గురువారం రాత్రి ఎర్రవరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి చీడిగుమ్మలలో తీర్థంతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గొలుగొండ, నర్సీపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఎర్రవరం రాజులుబాబు గుడి వద్ద బారులు తీరిన భక్తులు

రాంబాబు మాస్టారుకు సత్కారం



రాంబాబు మాస్టారుని సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రోలుగుంట: కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ అప్పన రాంబాబు మాస్టారు రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి నుంచి అవార్డు అందుకున్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం పి.అచ్చుతం, సహచర ఉపాధ్యాయులు సాంబశివరావు, వరహాలరాజు, రమేష్ తదితరులు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ తనకు ఈ గుర్తింపు రావడం హెచ్‌ఎం, సహచర సిబ్బంది అందించిన సహకారమేనని కృతజ్ఞతలు తెలిపారు. కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, జెడ్పీ ఉన్నత, ఎంపీపీ పాఠశాలల పీఎంసీ చైర్మన్లు గొల్లు రాజబాబు, చుక్కా సత్తిబాబు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ రాంబాబు మాస్టారుకు అభినందనలు తెలిపారు.

వంటషెడ్ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



మోదకొండమ్మ వంటషెడ్ నిర్మాణానికి విరాళాలు అందిస్తున్న దాతలు

మాడుగుల రూరల్: మండలంలోని కేజేపురం గ్రామంలో వెలసిన మోదమ్మ ఆలయంలో వంట షెడ్ నిర్మాణానికి శుక్రవారం దాతలు విరాళాలు అందించారు. విరాళాలు అందిన వారిలో ఆడారి గోపాల స్వామి కుమారుడు అప్పారావు, గోపాలకృష్ణ, లక్ష్మీసత్యనారాయణ, సుభద్ర, రమణబాబు, కోటమ్మ, రామునాయుడు, నాగమణి, శ్రీనివాసరావు, కృపామణి దంపతులు రూ.2 లక్షలు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. వంట షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, మాజీ సర్పంచ్ పెంటకోట అప్పారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, ఆడిరా గణేష్, కాళ్ల అమ్మతల్లినాయుడు, మాస్టారు కాళ్ల సూరిబాబు, బుద్ధ కోటి పాల్గొన్నారు.

విద్యుత్ ఫీడర్ మార్పునకు డీఈఈ పరిశీలన

దేవరాపల్లి: బి.కింతాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వేచలం రూరల్ ఫీడర్‌లో ములకలాపల్లిని సమీపంలోని ఎం. అలమండ ఫీడర్‌లోకి మార్చేందుకు సాధ్యసాధ్యాలను చోడవరం డీఈఈ యుకేజీ. ప్రసాద్ పరిశీలించారు. ఈ మేరకు ములకలాపల్లిలో విద్యుత్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. వేచలం రూరల్ ఫీడర్‌లో లోడు ఎక్కువగా ఉన్నందున తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, సమీపంలోని ఎం. అలమండ ఫీడర్ నుంచి తమకు విద్యుత్ సరఫరా చేయాలని ఇటీవల ములకలాపల్లి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ఆయన స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ఎస్ఈను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఫీడర్ మార్పుకు సాధ్యసాధ్యాలను చోడవరం డీఈఈ ప్రసాద్ పరిశీలించారు. ఈ నివేదికను ఎస్ఈకు అందిస్తామని డీఈఈ తెలిపారు.

1న వేంకటేశ్వరస్వామి పూజా సామగ్రికి వేలం

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 1న స్వామివారి తలనీలాలు, కొబ్బరి చెక్కలు, పూజా సామగ్రికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈవో టీఎస్ఎస్ శర్మ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు శుక్రవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ఈ నెల 31వ తేదీ ఐదు గంటలలోపు తలనీలాలు పోగు చేసుకునేందుకు రూ. 5 వేలు, కొబ్బరి చెక్కలు తీసుకునేందుకు రూ. 5 వేలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు వెయ్యి రూపాయలు చొప్పున ఈవో వేంకటేశ్వరస్వామి దేవస్థానం వడ్డాది పేరున డీడీ తీసి దేవదాయశాఖ కార్యాలయం వద్ద అప్పగించాలని సూచించారు.

జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తులు



బారులు తీరిన లబ్ధిదారులు

రోలుగుంట: ఈ నెల 30న జగనన్న చేదోడు పథకం మూడో విడత సాయం లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది. అందుకుగాను గ్రామ వలంటీర్ల ద్వారా కుల ధ్రువపత్రాలను పాత లబ్ధిదారులు, అర్హులైన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. ఈ నెల 26న రిపబ్లిక్ డే సెలవు దినం కావడంతో ఈ నెల 27 తేదీ కూడా ధరఖాస్తులకు అవకాశం ఇచ్చారు. దీంతో దర్జీలు, నాయీబ్రాహ్మణులు, తోపుడుబండ్లు, తదితర చిరువ్యాపారులు తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాన్ని ఆశ్రయించారు. శుక్రవారం ఒక్క రోజే 150 మంది సేవలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

నేడు వి.వి.అగ్రహారంలో చంద్రమ్మదొర తీర్థం

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారంలో మాడుగుల సమితి తొలి అధ్యక్షుడు చంద్రమ్మదొర తీర్థం శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏటా రథసప్తమి రోజున ఇక్కడ తీర్థం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేడు మైసమ్మతల్లి తీర్థం

కె.జె.పురం–దబ్బగుంట రహదారిలో మైసమ్మ తల్లి తీర్థం శనివారం నిర్వహించనున్నారు. కె.జె.పురం, ఎం.కోటపాడు, వల్లాపురం, మాడుగుల గ్రామస్తులు ఈ వేడుక చేయనున్నారు. ఈ సందర్భంగా 101 ఘటాలతో కె.జె.పురం నుంచి ఆలయం వరకూ ర్యాలీగా భక్తులు వెళ్లనున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన, ఎడ్ల పరుగు, కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ సందడి

రోలుగుంట: గ్రామాల్లో గౌరీపరమేశ్వరుల ఉత్సవాల సందడి నెలకొంది. గత వారం జె.నాయుడుపాలెం, కుసుర్లపూడి, బల్జిపాలెం గ్రామాల్లో ఈ ఉత్సవాలు జరగ్గా, శుక్రవారం కొవ్వూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పల్లకిపై ఊరేగించారు. తర్వాత యధావిధిగా ఉత్సవ స్థలంలో ఉంచగా భక్తులు ఉదయం నుంచి సాయింత్రం వరకూ దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విస్తారంగా మిరప సాగు



పింద్రంగిలో మిరపచేను

కె.కోటపాడు: మండలంలో పలు గ్రామాల్లో రైతులు విస్తారంగా మిరప సాగు చేపడుతున్నారు. దాలివలస, పింద్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శృంగవరం, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 150 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాగు కాలంలో పది రోజులకు ఒక మారు నీటి తడుపు అందించాలి. ఈ విధంగా సాగు చేపడితే మొక్క నాటిన 45 రోజులకు పూతదశకు చేరుకుంటుంది. మంచి దిగుబడి వస్తుందని అధికారులు సూచిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలంలో మంచి లాభాలు పొందలగమని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.